వారం వారం కథాప్రభ

# నాకు పెళ్ళవుతుందా!

శైలబాల




పేరు : శశికళ

వయసు : 29 సంవత్సరాలు

రంగు : తెలుపు

ఎత్తు : 5'3"

కులం : బ్రాహ్మణ - వైదికులు

విద్యార్హత : డిగ్రీ

ఉద్యోగం : బ్యాంకులో క్లర్కు

"వరుడు ఏదైనా సరే ఉద్యోగిగా ఉండాలి. కులం శాఖల పట్టింపు లేదు. ఆసక్తి ఉన్నవారు కింది చిరునామాను సంప్రదించగలరు..." అని నా చిరునామా ఇచ్చాను.

ఈ విధమైన ప్రకటనలు ఈ రోజుల్లో మామూలే. అయితే, నేనెందుకిలా చేశాను అన్న ప్రశ్నకు జవాబు చెప్పవలసిన అవసరం లేకపోయినా, నా జవాబువల్ల కొంతమంది జీవితాలైనా

బాగుపడతాయేమోనని చెప్పాలనుకుంటున్నాను.

అందరూ ఈ ప్రకటన చూసి ఆశ్చర్య పోయారు. నా కోసం గత తొమ్మిదేళ్లుగా సంబంధాల కోసం తిరుగుతున్న తండ్రి ఉండగా, స్వతంత్రించి నేనీ పనిచేయడం మా కుటుంబ సభ్యులకు నచ్చలేదు. గతించిన తొమ్మిదేళ్లు కాదు, మరో తొమ్మిదేళ్లు తిరిగినా నే నిలాగే ఉంటాను. అలా ఉండలేకనే నే నీ పని చేశాను.

అడుగడుగునా ఆచార వ్యవహారాలు పాటించే సంప్రదాయ కుటుంబంలో పుట్టాను. ఇన్నేళ్లూ ఇష్టం ఉన్నా, లేకున్నా అందరినీ గౌరవిస్తూనే బ్రతికాను. నా తల్లిదండ్రులు నేనిలా బరి తెగించినందుకు దిగ్భ్రమ చెందుతారు. మా చుట్టాలు శాపనార్థాలు పెడతారు. ఎవరేమైనా అనుకోనీ, నాకు భయం లేదు. బాధ అసలే లేదు!

నా తండ్రికి తన ఉద్యోగం, పరువు, సంప్రదాయం ఇవే ముఖ్యం. పిల్లల ఆలోచనలు, అభిప్రాయాలు అస్సలు అవసరం లేదు. అదేమంటే, "నేను పోషించినంత కాలం, నా ఇంట్లో ఉంటున్నంత కాలం, నేను చెప్పినట్టే విని పడుండాలి!" అని ఓ స్టేట్‌మెంటు! అంటే... ఆయన పోషణలో



లేకుంటే, ఆయన ఉన్న కప్పు కింద ఉండకపోతే ఆయన మాట విననక్కర్లేదనేగా! అంటే నేను విననక్కర్లేదు. అంతే!

నిజం చెప్పాలంటే, ఆయన నియంతృత్వ ధోరణే నన్నిలా మార్చింది. నేనింకా ఇలాగే ఉంటే, నా చెల్లి సంగతేంటి? దాని కప్పుడే ఇరవయ్యారేళ్లు వచ్చాయి.

సరే, నా ఈ ప్రకటన నిర్ణయం వెనుక కారణాలకు వద్దాం.

❖ ❖ ❖

**నా** డిగ్రీ పూర్తి కాగానే సంబంధాలు చూడటం మొదలెట్టారు. అందుకోసం ఫోటోలు అవసరమయ్యాయి. పాస్‌పోర్టు సైజువో, అప్లికేషన్లకు అంటించినవో, హాల్ టికెట్ల మీదివో పనికి రావు! కేవలం, ఇందుకోసమే ప్రత్యేకంగా... ఏ స్టూడియోలో బాగా తీస్తారో ఆరాలు తీసి, రకరకాలుగా మేకప్ చేసుకుని, ఎలాంటి అలంకరణలో బావున్నానో ఇంట్లో వాళ్లు చెప్పాక ఆ మేకప్ చెరిగి పోకుండా జాగ్రత్త తీసుకుని, ఆటోలో వెళ్లి మరీ ఫోటోలు తీయించుకున్నాను.

పెళ్లిచూపుల కోసం తీయించుకునే ఫోటోల వెనుక ఇంత కథ ఉంటుందా అని ఆశ్చర్యపోకండి!. సరే... అది పూర్తయింది కదా! అలాగని ఒకసారి తీయించుకుంటే సరిపోదు. ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. విచిత్ర మేమిటంటే, ఇంత శ్రద్ధ తీసుకున్నా నే నెవ్వరికీ నచ్చలేదు!

చదువు, ఉద్యోగం, మంచి రంగు, తగిన ఎత్తు, ఎత్తుకు తగ్గ శరీర సౌష్ఠవం, ముఖంలో అంతో ఇంతో కళ ఉన్నాయి నాకు. మరి నాకెందుకు పెళ్లి కావడం లేదు?

ఇవన్నీ పూర్తిగా లేని, వీటిలో కొన్ని మాత్రమే ఉన్న వారికి కూడా నాకన్నా చిన్న వయసులోనే పెళ్లిళ్లయిపోయాయి. నేను చెప్పే కారణం వింటే విచిత్రంగా అనిపిస్తుందేమో మరి! ఎందుకంటే, పెళ్లి సంబంధాలు ఎలా చూడాలి, పెళ్లిళ్లెలా చేయాలి అన్న విషయాల మీద నాకెవరైనా డాక్టరేట్ ఇవ్వగలిగినంత పరిశోధన చేశాను అని అందరూ తెలుసుకోవాలని నా మనవి.

ఇక వినండి... చాలా మంది తల్లిదండ్రులకు ఉన్నది భాషా దౌర్భాగ్యం! వాళ్లకు మాట్లాడటం రాదు, అవతలి వారిని ఎలా చూడాలో తెలీదు... ముఖ్యంగా లౌక్యం తెలీదు. చెప్పులరిగేలా సంబంధాల కోసం తిరగడం తప్ప మరేమీ తెలీదు. ఆడపిల్లల అర్హతల మాటెలా ఉన్నా, వారి తల్లిదండ్రులు మాట్లాడటం నేర్చుకోవాలి. లౌక్యం ఒంట బట్టించుకోవాలి. లేకపోతే... ఆ రెండూ దండిగా ఉన్నా ఓ మధ్యవర్తినైనా కుదుర్చుకోవాలి. ఇది నేను పరిశోధించిన మొదటి అంశం. అవకతవకగా మాట్లాడటం వల్ల వచ్చిన సంబంధాలు తప్పిపోవడం కాకుండా, వచ్చేవి కూడా కాకుండా పోతాయి.

మధ్య తరగతి మగ పెళ్లివారు ఆడపెళ్లివారి నుంచి ఎంత, ఎలా రాబడదామా అని ఆలోచిస్తుంటారు- తమ అబ్బాయిది ప్రైవేటు ఉద్యోగమైనా సరే. ఆడపెళ్లివారు కాబోయే అల్లుడు గవర్నమెంటు ఉద్యోగి కావాలని, రిటైర్‌మెంటు తరువాత పెన్షను రావాలని, జీవితాంతం తమ అమ్మాయి సుఖంగా జీవితం గడపాలని చూస్తారు. ఇలా అయితే ఎంతోమంది ఆడపిల్లలు వృద్ధ కన్యలుగానే మిగిలిపోక తప్పదు! అందుకే ఆడపిల్లల తల్లిదండ్రులు కూతుళ్లను ప్రైవేటు ఉద్యోగులను చేసుకునే ధైర్యం ఉందో, లేదో అడగాలి. లేదా ఆ ధైర్యాన్ని నూరిపోయాలి. ఇది నేను పరిశోధించిన, నేర్చుకున్న రెండో అంశం.

నా విషయానికే వద్దాం. నాకు చూసిన ప్రతి సంబంధమూ కుదిరిపోతుందనే అనిపించేది. కాని కుదిరేది కాదు. కొందరు జాతకాలు కలవలేదనే వారు. కొంతమంది 'పిల్ల పొట్టి' అనేవారు. కొందరికి ఉద్యోగిని కావాలి (అప్పటికి నాకు ఉద్యోగం లేదు). మరి కొందరికి మేమిచ్చే కట్నం సరిపోలేదు. ఇక కొందరు పీ.జీ. చేసిన పిల్లైతే బాగుంటుందనేవారు.

ఇవన్నీ వంకల కిందే తోచేవి నాకు. అన్నివిధాలా నచ్చకపోతే ఒప్పుకోనవసరం లేదనే నా అభిప్రాయం కూడా.

ఓ మందనంతటినీ పెళ్లిచూపుల పేరిట ఇళ్లకు పిలిచి, స్వీటూ, హాట్లతో మేపి, డబ్బు దండుగ చేసుకుని, మనస్సు పాడు చేసుకోవడం ఏమంత మంచి పని? అందువల్ల ముందుగానే, అబ్బాయి వివరాలు పూర్తిగా తెలుసుకోవాలి. అతని అభిరుచులు, తమ తాహతుకు సరిపోతాడా, అతనికి నచ్చే లక్షణాలు మనమ్మాయికి ఉన్నాయా, ఈడూ, జోడూ కుదురుతుందా - ఇత్యాదులు ముందే చూసుకోవాలి. ఆపైన, అన్నీ సరిపోతాయి, ఇక పరవాలేదు అనుకున్నాక, అమ్మాయిని కూడా ఓ మాట అడిగి, అప్పుడు పెళ్లి చూపులకు మగ పెళ్లివారిని ఆహ్వానించాలి. దాన్ని మామూలు పెళ్లిచూపుల్లా కాక, తాంబూలాలు పుచ్చుకునే సందర్భంగా మార్చుకోవాలి. ఈ పద్ధతి పాటించిన నాడు అనవసరంగా గంగిరెద్దు అలంకరణతో మగపెళ్లివారి ముందు ఎన్నోసార్లు 'చూపులకు' కూర్చునే బాధ అమ్మాయికి తప్పిపోతుంది. పెళ్లిచూపులంటేనే జడిసిపోయే సందర్భాలూ తగ్గుతాయి. ఇలా నేనంటేనే "ఏం, పెద్ద సంఘ సంస్కర్త ననుకుంటున్నావా? నోరు మూసుక్కూచో. పెద్దముండా వాళ్లం మేమంతా ఉన్నాం. పిల్ల పీనుగవి నీకేం తెలుసు?" అంటూ నా పెద్దలు నన్ను కొట్టినంత పని చేశారు. ఇది ఆలోచించ వలసిన మూడో అంశం కాదంటారా?

నాన్నంటే పురుషాహంకారం మూర్తీభవించిన మగవాడు. మరి అమ్మ....? అమ్మైనా నా బాధను అర్థం చేసుకుని, నా మనసు తెలుసుకుంటే ఎంత బాగుండునో కదా! నాన్నకు కాస్త సర్ది చెబితే, నాకీ పెళ్లిచూపుల ప్రహసనం తప్పుతుందని నా ఆశ.

ఓసారి అమ్మ అంది- "పిల్ల నచ్చితే, మిగతావన్నీ వాళ్లే సర్దుకుంటారమ్మా" అని.

ఊరుకోలేకపోయాను. "అలా చూడగానే ఇలా పిల్ల నచ్చడం అనేది నూటికి ఏ ఒకరిద్దరికో పట్టే అదృష్టం. మనమంత అదృష్టవంతులమై ఉంటే, ఎప్పుడో కుదిరేది కదా!" అన్నాను.

సత్యాన్ని జీర్ణించుకోలేక పోయింది అమ్మ. పాపం, ఆమె అహం దెబ్బతిన్నది. "నీ కీ మధ్య నోరెక్కువవుతూందే! చూసేవాళ్లేమనుకుంటారో నన్న ఇంగితం కూడా లేకపోయిందా? నీ అదృష్టం అలా తగలడితే, మేమ్మాత్రం ఏం చేస్తాం? పెళ్లి కోసం బరితెగింపు కూడదు!" అంది.

నేను అవాక్కునయ్యాను. ఆ మాట లింకెవరైనా అంటే ఖాతరు చేసేదాన్నే కాదు. కన్నతల్లి... నా తల్లి అనాల్సిన మాటలేనా అవి? ఆ రోజు నుంచి మాటలురాని మూగదానిలా ఎవరు, ఎప్పుడేం చేయమంటే అది చేస్తూ నా ఇష్టాలు, అయిష్టాలు అన్నీ చంపేసుకుని బ్రతకడం అలవాటు చేసుకున్నాను.



**నాన్ వెజ్**

"మీ ఆవిడ నాన్-వెజిటేరియన్, నువ్వు వెజిటేరియన్. ఏం, మీది ఇంటర్ కేస్ట్ మారేజా?" అడిగాడు శరత్ మిత్రుడ్ని.

"కాదు. పెళ్లికి ముందు మా ఆవిడా వెజిటేరియనే. తర్వాత మారిపోయింది. పెళ్లి అయ్యాక రోజూ నన్ను కాల్చుకు తింటోంది మరి."

**పి. సరోజ** (అమలాపురం)

✤ ✤ ✤

**నా** వయసుకు మరికొన్నేళ్లు కలవడం తప్ప, ఇంటి పరిస్థితుల్లో మార్పేమీ రాలేదు. అందరూ ఉద్యోగినే కావాలనేసరికి, పెళ్లిచూపుల ఉధృతం కొంతవరకు తగ్గిందనే చెప్పాలి.

ఓ రోజు అమ్మ నా దగ్గిరి కొచ్చి, "ఇంట్లో ఖాళీగా అలా ఉండే బదులు, ఏవైనా టెస్టులవీ రాస్తే బాగుంటుందేమో! మీ నాన్న ఆలోచించమన్నారు. ఏదైనా కోచింగ్ కావాలంటే చేర్పిస్తానన్నారు" అంటూ, ఇంకా ఏదో చెప్పబోతూ ఆగిపోయింది.

ఆవిడ ఎందువల్లనైనా అడగనీ, నాకు చాలా ఆనందం కలిగింది. నా కోరిక కూడా అదే! వాళ్లనడిగితే, "ఉద్యోగాల వేటలో ఊళ్లు పట్టుకు తిరగడం మన వంశాచారం కా"దంటారని సంశయించాను. పెళ్లయ్యేదాకా నే నా ఇంట్లో ఉండక తప్పదు! ఉద్యోగం లేకుండా బయటకు వెళ్లే ధైర్యం లేదు. ఉన్నా భయమే! ఒంటరి ఆడపిల్లనని తెలిస్తే, ఈ 'మగ పురుష' ప్రపంచం ఊరికే ఊరుకోదు! ఉద్యోగం అంటూ ఒకటొస్తే ఆ పైన ధైర్యం దానంతట అదే వచ్చి వరిస్తుందేమో చూడాలి.

కోచింగ్ తీసుకుంటూ, చదువు మొదలుపెట్టాక ఓ ఏడాది ఇట్టే గడిచింది. ఇక్కడ నే పరిశోధించిన నాల్గవ అంశం ఉంది.

చాలా మంది ఆడపిల్లలు చదువుకుంటుండగా, సంబంధాలు వస్తే, చదువు మాన్పించేసి పెళ్లి చేసేస్తారు. దురదృష్టవశాత్తు ఆ ఇల్లాళ్లకు జరగరానిదేదైనా జరిగితే అటు చదువు పాడై ఉంటుంది. ఇటు జీవితం నిరాధారం అవుతుంది. కనుక ఆడపిల్లలకు చదువు పూర్తయ్యేదాకా పెళ్లి చేయకూడదు. చేసినా, ఆ చదువు మాత్రం పూర్తి చేయించాలి. అది భవిష్యత్తుకు ఎంతైనా మంచిదని తల్లిదండ్రులు గుర్తించాలి, గుర్తించి తీరాలి!

మొత్తానికి నా కృషి, పూజలు ఫలించి నేను బ్యాంక్ ఉద్యోగినినయ్యాను. ఉద్యోగం రావడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. నా బ్రతుకూ ఓ గాడిలో పడింది.

మా ఆఫీసులో నా సహోద్యోగులెవరైనా వెధవ్వేషా లేస్తారేమోనని మా వాళ్లు అనుమానించారు. ఓ పక్క నా మీద నిఘా వేసి ఉంచే, మరో పక్క సంబంధాలు చూడ్డం ముమ్మరం చేశారు. కారణం ఏదైనా చాలా సంబంధాలే వచ్చాయి. ఫలితం మాత్రం శూన్యమే! అదేమిటీ, మళ్లీ ఆశ్చర్యపోతున్నారా? అప్పటికి ట్రెండ్ మారి ఉద్యోగంలేని అమ్మాయిలను చేసుకోవడం మొదలైంది.

ఇక్కడో విషయం చెప్పుకుంటే తప్పులేదు. ఆడపిల్లల తండ్రికీ షేర్ బ్రోకర్‌కూ చాలా దగ్గిరి పోలికలున్నాయి. షేర్ బ్రోకర్‌కైతే, ఏ షేర్‌కు ఎంత ధర పలుకుతూంది, ఏది కొనాలి, దేన్ని అమ్మేయాలి, దేన్ని మరికొన్ని రోజు లుంచుకోవచ్చు, దేని ధర పడిపోయింది - వగైరా ఆకళింపు చేసుకోవలసిన అంశాలు.

ఇక ఆడపిల్లల తండ్రి విషయానికొస్తే... మగపెళ్లి వారి మార్కెట్లో ట్రెండ్ చూసుకోవాలి, ఎప్పటికప్పుడు. ఓసారి ఉద్యోగిని అయిన అమ్మాయి కావాలంటారు. మరోసారి ఇంటి పనులు చేసుకుంటే మేలంటారు. ఒకసారి కట్నం చాలా ఎక్కువ కావాలంటారు. మరోసారి 'కట్నమే వద్దు, పిల్లే మా బంగారు తల్లి' అంటారు. కనుక ఆడపిల్లల తండ్రులు బావిలో కప్పల్లా కాకుండా, ప్రస్తుత ధోరణిని గమనించి మసలుకోవాలి.

ఇది నేను పరిశోధించిన అయిదవ అంశం. ఎందుకంటారా, నీకు ఉద్యోగం లేనప్పుడు ఉద్యోగం ఉంటే చేసుకుంటామన్నవారు, మరో సంబంధం చూసుకున్నారు. తీరా నాకు ఉద్యోగం వచ్చాక అది పెళ్లికి నాకు పనికిరాని అదనపు అర్హత అయింది.

ఇలా ఉండగా...

బహుశా నా 28వ ఏట అనుకుంటాను... ఒకరు "మీ అమ్మాయి నచ్చింది. తాంబూలాలు పుచ్చుకుందాం" అన్నారు. అంతే మా ఇంట్లో ఆ రోజు పండుగే చేసుకున్నారు. పెళ్లి ఎక్కడ, ఎలా చేయాలి, ఎవరెవర్ని పిలవాలి వగైరా చర్చలు వేడి వేడిగా సాగుతుండగా...

మా పెద్దమ్మ హఠాత్తుగా నాకూ, ఆ పెళ్లి కొడుక్కీ వయస్సు తేడా అట్టే లేదన్న పాయింటు లేవనెత్తింది. "అలా ఉండడం వరహీనం" అంది. ఎప్పుడూ ఇతరుల మాటలే వినే నాన్న- ముఖ్యంగా తల్లి మాటలు- ఈ కారణంవల్ల సంబంధం వదులుకుంటున్నట్లు వాళ్ల క్కబురు చేశాడు. వాళ్లెంత దిగివచ్చి నచ్చజెప్పినా వినలేదు. నా అభిప్రాయం ఒక్కటంటే ఒక్కసారి ఎవ్వరూ అడక్కపోవడం నాకు మరోసారి దెబ్బ! ఇది నేను భరించలేకపోయాను. కాని ఏమీ చేయలేక పోయాను.

తర్వాత మరో సంబంధం దాదాపు కుదిరిందనుకున్నాము. కాని ఆ అబ్బాయి మా అక్క భర్తకన్నా పెద్దట. అదీ కొన్ని నెలలు! అయినా సరే, "మావారికన్నా నా మరిది పెద్దవాడవటానికి వీల్లేదూ, ఆవటా" అని అడ్డుపడింది స్వయాన నా తోబుట్టువు!

మరో సంబంధం సగోత్రికులు కావడంవల్ల తప్పిపోయింది. దీంతో నాకు సహనం చచ్చిపోయి, నాన్నను "ఇలా అన్నీ కాదని ఏ రెండో పెళ్లి వాడికో కట్టబెడతారా నా నలభయ్యో ఏట!" అని అడిగేశాను ధైర్యంగా. "అప్పటికిక ముప్పాతిక జీవితం అయ్యే పోతుంది. మహా అయితే ఓ తోడు కోసం పెళ్లాడాలి. అంతే కదా!" అన్నాను కూడా.

'పొగరెక్కి పోయిందే నీకు! పో నా ఇంట్లోంచి!' అన్నాడాయన ఆవేశంతో.

అంతే! తక్షణం రోడ్డుమీ దున్నాను.

ఇప్పుడు నాకు ముప్పై అయిదేళ్లు. ఇలా ప్రకటన ఇవ్వడం బరితెగింపు కాదు. నన్ను 'అమ్మా' అని పిలిచే పిల్లలు కావాలి, నా కో చల్లని నీడనిచ్చే మనస్సు కావాలి. అవి రెండూ దొరికి తీరుతాయని నా దృఢ విశ్వాసం.

మరి మీ రేమంటారు? ●